మూగజీవాలకు ముప్పు

అడపదడపా వర్షాలు కురుస్తుండడంతో మూగ జీవాలైన పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. దీన్ని గుర్తించి ప్రతి రైతు తగిన జాగ్రత్తలు తీసుకుని పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాల్సి ఉంది. సరైన టీకాలు, చికిత్స చేయించుకుని ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మూగజీవాలు వ్యాధులు బారిన పడకుండా కాపాడుకోవచ్చని పశువైద్యులు చెబుతురు.

– దొరవారిసత్రం

- సీజనల్ వ్యాధులు సోకే సమయం
- టీకాలు వేయించక తప్పదంటున్న పశువైద్యులు




వేణుంబాకంలో మేతకు వెళ్తున్న ఆవుల మంద, మావిళ్లపాడు గ్రామంలో నోటి పుండ్లు పరిశీలిస్తున్న పశువైద్యులు

పెళ్లకూరు ఏరియా వెటర్నరీ హాస్పిటల్ పరిధిలోని దొరవారిసత్రం, పెళ్లకూరు మండలాల్లో నాలుగు ప్రాంతాల్లో వెటర్నరీ డిస్పెన్సరీలు, మరో నాలుగు ప్రాంతాల్లో రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లు ఉన్నాయి. వీటి పరిధిలో పశువైద్యుల గణాంకాల ప్రకారం ఆవులు 10,800, గేదెలు 23,153, గొర్రెలు 76,739, మేకలు 17,565, పందులు 42, కోళ్లు 69,300 ఉన్నాయి. జాతుల వారీగా మూగ జీవాల్లో ఎలాంటి మార్పులు వచ్చినా అందుబాటులోని పశువైద్యులను సంప్రదించి ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చు.

పశువుల్లో గొంతు వాపు

ప్రస్తుత పరిస్థితుల్లో పశువుల్లో గొంతు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇది చాలా ప్రమాదకరమైంది. ఈవ్యాధినే గురక వ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల కారణంగా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీళ్లు, మేత ద్వారా పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఈవ్యాధి బారిన పడుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులను మిగతా పశువులతో ఉంచితే వాటికి వ్యాప్తి చెందుతుంది. మందలోనే ఉంచకుండా వేర్వేరుగా ఉంచాలి. వర్షాకాలంలో పశువులు వానలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

బ్లూటంగ్–ఫుట్ రాట్ వ్యాధి

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం మూతి వాపు, నోటిలో పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటడం లక్షణాలు కనిపిస్తాయి. వంటిలో నీరు చేరడం మేత మేయకపోడంతో పాటు అబార్షన్, 30 శాతం జీవాలు మృతి చెందుతాయి. దీని నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడు బ్లూటాక్స్ టక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పాడి ప్రాంతాల్లో మేత మేసే విధంగా చూసుకోవాలి.

కాళ్ల పుండ్లు

మూగ జీవాలకు కాళ్ల పుండ్ల వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి దుర్వాసన వస్తుంది. అలాగే గొర్రెలు కుంటుకుంటూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపించినప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పాడి ప్రాంతంలోనే మేత మేసే విధంగా చూసుకోవాలి.

నివారణ చర్యలు

జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలి. దీంతోపాటు పౌష్టికాహారం అందించాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

చిటిక వ్యాధి

ఈ వ్యాధి మన జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల్లో వస్తుంది. వరి కోతలు పూర్తి అయిన తరువాత పెట్టిన గడ్డి పిలకలను మేయడం ద్వారా ఈవ్యాధి సోకుతుంది. గడ్డి పిలకలను గొర్రెల పరిమితికి మించి తీసుకుని గాలి ఆడని పరిస్థితి నెలకొంటుంది. దీనిద్వారా 'ఎంటారో టాక్సినియా' అనే బాక్టీరియా ఉత్పత్తి కావడంతో ఈవ్యాధి వస్తుంది. ఏడాది వయస్సు ఉండే గొర్రెల్లో ఈ వ్యాధి అధికంగా కనిపిస్తుంది. ఇది సోకిన గొర్రెలు నీరసించి కొద్ది సేపటికే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయాలి. ఈ వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేయాలి.

వ్యాధులు రాకుండా టీకాలు వేశాం



పశువులు, జీవాలకు వర్షకాలంలో వ్యాధులు రాకుండా ఇప్పటికే టీకాలు వేశాం. ఇందులో ముఖ్యంగా బ్లూటంగ్, గొంతు వాపు వ్యాధి, చిటిక వ్యాధులకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఆస్పత్రి పరిధిలోని మూగజీవాలన్నింటికీ మే నెలలోనే గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి వ్యాక్సినేషన్ పూర్తి చేశాం. కాళ్ల పుండ్లు వ్యాధికి మాత్రం ఎంలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ముందు జాగ్రత్తల ద్వారానే ఈ వ్యాధిని నిర్మూలించాలి.

– కె.శ్రీదేవి, పశు వైద్యాధికారి, డీవీ సత్రం

క్లుప్తంగా


గరుడ వాహనంపై లక్ష్మీ నరసింహుడు



బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బంగారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో శనివారం ఉదయం స్వామివారి మూల మూర్తికి విశేష అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. చందనాలంకరణలో స్వామివారిని కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని నిత్యాన్నదాన పథకానికి వైఎస్ఆర్ జిల్లా వాస్తవ్యుడు కల్లూరు వెంకటప్ప, వెంకటమ్మ దంపతులు, వారి కుమారుడు హరేంద్ర శనివారం రూ.1,01,632 నగదును విరాళంగా అందించినట్లు దేవస్థానం డీసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దాతలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించినట్లు తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు సీతారామయ్యస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్ల పంపిణీ



పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పేదలకు శనివారం శ్రీకృష్ణ ఫౌండేషన్ నిర్వాహకులు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లు అందించారు. తిరుపతి పట్టణానికి చెందిన చిగురువాడ జయంత్ శరణ్య దాతృత్వంతో పేదలకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధీరజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

గూడూరు రూరల్: రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎలాంటి పంటలు పండించాలనే విషయాలపై అవగాహన పెంపొందించేలా శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పని చేయాలని జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వ్యవసాయ సహాయక సంచాలకులు ఎం.భాస్కరయ్య సూచించారు. గూడూరులో డివిజన్ స్థాయి వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సామర్థ్యాల పెంపుపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు జిల్లాలోని ఆత్మ డైరెక్టర్ శివనారాయణ మాట్లాడుతూ ఆత్మలో జరిగే విస్తరణ కార్యక్రమాలు, పథకాలపై అవగాహన కల్పించారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారులు స్ప్రింక్లర్లు, డ్రిప్ పద్ధతులకు సంబంధించిన రాయితీల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అధికారి రవిచంద్ర ప్రసాద్, సతీష్, వేణుగోపాల్‌రావు, గోపినాయక్, ఏఓ చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

నాయుడుపేట టౌన్: సీతారాం ఏచూరి జీవితం అందరికి ఆదర్శప్రాయమని, ఆయన లేనిలోటు పార్టీకి తీరనిదని సీపీఎం(ఐ) పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పుల్లయ్య, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, ముకుంద, మహేష్, డాక్టర్ రామసుబ్బయ్య, యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ర్యాలీ

నాయుడుపేట టౌన్: ప్రజల సమస్యల పరిష్కారం, నిత్యావసర సరుకులు ధరలు నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ సీఐటీయూ అధ్వర్యంలో ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి సీఐటీయూ, సీపీఎం(ఐ), ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును ఎండగడతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పలు కూడళ్ల వద్ద సీపీఎం(ఐ) జిల్లా నాయకుడు నాగరాజు మాట్లాడుతూ ముఖ్యంగా పరశ్రమలలో పని చేస్తున్నా వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం అందిచాలని కోరాఉ. ప్రజా సమస్యలపై ప్రభుత్వ స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుల్లయ్య, ముకుంద, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫల సరుకుల పంపిణీ



దివ్యాంగులకు ఫల సరుకులు పంపిణీ చేస్తున్న వైద్యులు

గూడూరు రూరల్: దివ్యాంగుల్లో మనో ధైర్యం నింపి వారి సంపాదనపై వారు జీవించేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి తెలిపారు. పట్టణంలోని వీరభద్ర స్వామి గుడిలో శనివారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ దాతల సహకారంతో రెడ్ సంస్థ దివ్యాంగులకు నెలనెలా అండగా నిలవడం ఎంతో అభినందనీయమని అన్నారు. అలాగే దివ్యాంగులు కూడా తమ మనోధైర్యం కోల్పోకుండా తాము చేయగలిగిన పనులు చేసుకుంటూ జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని అన్నారు. ఇందుకు దాతల సహకారం కూడా తీసుకుని జీవితంలో మరొకరికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. అనంతరం సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనూజ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

భూసారంపై ప్రత్యే శ్రద్ధ అవసరం



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీనివాసులు

వెంకటగిరి రూరల్: పంటలు సాగు చేస్తున్న రైతులు భూసారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. కృషివిజ్ఞాన కేంద్రంలో పీఎం కిసాన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పండ్లతోటల్లో భూ పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలన్నారు. అధిక రసానియక ఎరువుల వినియోగం తగ్గించి, భూమి సారవంతంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు పంట తెగుళ్ల నివారణపై జాగ్రత్తలు వహించాలని తెలియజేశారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, నాగార్జునరెడ్డి, రాజీవన, రైతులు పాల్గొన్నారు.

శ్రీయోగశ్రీనివాసమూర్తిగా శ్రీవారు



శ్రీయోగ శ్రీనివాసమూర్తి అలంరణలో శ్రీవేంకటేశ్వర స్వామివారు, కల్యాణ వెంకటేశ్వరస్వామికి అలంకరణ వస్తువులు, ప్రత్యేక అలంకరణలో స్వామివారు

సూళ్లూరుపేట: పట్టణంలోని పార్కు వీధికి ఎదురుగా ఉన్న శ్రీ మద్వేంకట రామమూర్తుల వారి ఆలయంలో పెరటాసి నెల మూడో శనివారం సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారిని యోగ శ్రీనివాసమూర్తిగా అలంకరించారు. పెరటాసి మూడో శనివారం సందర్భంగా భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం చేసుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కల్యాణ వెంకన్నకు అలంకరణ సామగ్రి

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివార్లకు దాతలు రూ.6లక్షలకు పైగా విలువ చేసే అలంకరణ వస్తువులను బహుమతిగా అందించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం దాతలు అందించిన బంగారుపూత కలిగిన కిరీటం, శంకునామాలు తదితర అలంకరణ వస్తువులను అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి నగరోత్సవాన్ని పుర వీధుల్లో వేడుకగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో శనివారం కుంభాభిషేక మహోత్సవ వేడుకలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారామాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, కీర్తనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల భజనలతో గ్రామంలోని వీధులన్నీ మార్మోగాయి. ఆలయ అర్చకులు సీతారామ విగ్రహాలకు కుంకుమార్చన పూజలు చేసి కలశస్థాపన, హోమ పూజలు నిర్వహించారు. మేళతాళాలు నడుమ స్వామివార్ల విగ్రహాలకు మండల పూజ నిర్వహించారు. గణపతి పూజ, వాస్తుహోమం చేసి స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సీతారాముల కుంభాభిషేక మహోత్సవ వేడుకల్లో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

వైభవంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు



మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు, చిల్లకూరు: ధాన్యలక్ష్మిగా దర్శనమిస్తున్న ఆదిలక్ష్మీ అమ్మవారు, మల్లాంలో గాయత్రీ దేవి అలంకారంలో కామాక్షిదేవి, కోట: లలిత త్రిపుర సుందరిగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, పెంచలకోనలో ధాన్యలక్ష్మిగా ఆదిలక్ష్మిదేవి, రాపూరులో అన్నపూర్ణగా రాపూరమ్మ, పోతుకొండలో గాయత్రిదేవి అలంకరణలో అంకమ్మతల్లి

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసిఉన్న శ్రీబాలత్రిపుర సుందరీదేవీ ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వందలాది మహిళలు పాల్గొంటున్నారు. బాలత్రిపురసుందరీదేవీ అమ్మవారు శనివారం మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక హోమం నిర్వహించారు. నవగ్రహ శాంతి, గణేష్ హోమం అత్యంత వైభవంగా వేదపండితుల నడుమ నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ధాన్యలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు

చిల్లకూరు: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు అమ్మవారి ఆలయాల్లో అమ్మవారు వివిధ రకాల అలంకరణల్లో దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా శనివారం ఆదిలక్ష్మీ అమ్మవారు ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా తిరుపతికి చెందిన పుత్తేటి శ్రీహరిరెడ్డి, దేవసేన దంపతులు వ్యవహరించారు. అలాగే తూర్పుకనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ ఆలయంలో జరుగుతున్న దేవీనవరాత్రి ఉత్సవాల్లో బాగంగా అమ్మవారి మూల విరాట్‌కు శాకాంబరిగా అలంకరించారు. సాయంత్రం గాయత్రి దేవి దర్శనమివ్వగా మాడ వీధుల్లో అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దొరువుకట్టకు చెందిన దువ్వూరు రమణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చిట్టమూరులో..

చిట్టమూరు(వాకాడు): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మల్లాం గ్రామంలో వెలసిన మార్కండేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షిదేవి గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గూడలి సుధీర్‌శర్మ అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా దువ్వూరు ప్రభాకర్‌రెడ్డి, శ్రీలత, చిల్లకూరు చైతన్యరెడ్డి, జోషిత దంపతులు వ్యవహరించారు.

కోటలో..

కోట: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మండలంలోని పలు అమ్మవారి ఆలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. తూర్పువీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామదేవత కోటమ్మ త్రిపుర సుందరిగా భక్తులను కటాక్షించారు.

రాపూరులో..

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మీదేవి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ధాన్యలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధాన్యలక్ష్మీదేవిగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు దర్బార్ సేవ నిర్వహించారు. అమ్మవారిని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా రాపూరమ్మ

రాపూరు గ్రామదేవత అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం అభిషేకం, సాయంత్రం అన్నపూర్ణాదేవి అలంకరణతో ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. మండలంలోని వేపినాపి సమీపంలోని అంకమ్మతల్లి మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాపూరులోని పర్వతవర్థిని అమ్మవారు సంతాన లక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

చెంగాళమ్మకు సారె సమర్పణ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం మన్నారుపోలూరు, నూకలపాళెం, వట్రపాళెం ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి చీరసారెలను సమర్పించే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ప్రాంతాలకు చెందిన మహిళలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి తమకు తోచిన విధంగా చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మీ చీరసారెలను అమ్మవారికి సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నపూర్ణగా చెంగాళమ్మ పరమేశ్వరి

శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి మూడోరోజున శనివారం అన్నపూర్ణ అలంకారంతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం ఆవరణలోని యాగశాలలో అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన మహాచండీ యాగం కార్యక్రమాన్ని వేద పండితులు వేదమంత్రోఛ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నపూర్ణ అలంకారానికి ప్రముఖ జీవీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. చండీయాగానికి పట్టణానికి చెందిన కనసాని వేణుగోపాల్, లక్ష్మీ ప్రసన్న దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉభయకర్తలందరికీ సాయంత్రం కుంకుమార్చన నిర్వహించి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా స్థానిక శ్రీ డాన్స్ అకాడమీ వారు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన, చెన్నైకి చెందిన ఆర్ఎస్ భరత నాట్యాలయం వారు భరతనాట్య ప్రదర్శన చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వెంకటగిరి రూరల్: దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్ణకమ్మ వీధిలోని శ్రీహరిహర క్షేత్రంలో కాత్యాయని అమ్మవారు అన్నపూర్ణదేవిగా, ఉత్సవమూర్తి శ్రీ వెంకటేశ్వరస్వామి వరాహస్వామిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మోహిని అలంకారంలో అమ్మవారు కొలువుదీరగా మూల విరాట్ చందన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెలమపాళెం సమీపంలోని మందనాంచారమ్మ తల్లి ఆలయంలో వైష్ణవి దేవి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మండల పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ దేవత పోలేరమ్మ, మూకాంబిక ఆలయాల్లో అమ్మవార్లకు గాయత్రి దేవి అలంకరణలు చేపట్టి, పూజలు నిర్వహించారు. ఇంకా వాసవి కన్యకాపరామేశ్వరి, తిమ్మాజీకండ్రిగ గ్రామ స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గా మల్లేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు.



వైష్ణవి దేవిగా మందనాంచారమ్మ తల్లి, అన్నపూర్ణదేవిగా కాత్యాయని అమ్మవారు, వరహాస్వామిగా శ్రీ వెంకటేశ్వరస్వామి, మోహిని అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు, చందనాలంకారం, నాయుడుపేట మూకాంబికా దేవి, పోలేరమ్మ తల్లి

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న రోటరీక్లబ్ నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు శనివారం నాయుడుపేట రోటరీక్లబ్ వారు అవార్డులు ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయుడుపేట రోటరీక్లబ్ ప్రెసిడెంట్ పెనల జయరాజగోపాల్‌తోపాటు క్లబ్ నిర్వాహకుల సారథ్యంలో నాయుడుపేట, చిట్టమూరు, పెళ్లకూరు, ఓజిలి, కోట, డీవీ సత్రం, వాకాడు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు ఎ.భువనేశ్వరీ, జి.పద్మజ, కె.విజయ, ఎస్.నాగరాజు, పి.చెంగమ్మ, ఎన్.రమేష్, టి.గ్రేస్‌లను శాలువాలు కప్పి, అవార్డులు ప్రదానం చేశారు. నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు మండలాలకు చెందిన ఎంఈఓలు మునిరత్నం, శంకరయ్య, వెంకటప్రసాద్‌లను రోటరీక్లబ్ వారు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయిని ప్రమీలారాణిని రోటరీక్లబ్ సభ్యులుగా నియమిస్తూ గుర్తింపు బ్యాడ్జిని అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్‌కు చెందిన రామ్మోహన్, ఆదవరం నాగూరయ్య, పీడీ ఉదయ్‌శంకర్, సుబ్రమణ్యం, రామచంద్రారెడ్డి, కృష్ణారావు, చంద్ర, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సులోచనారాణి

గూడూరు రూరల్: మహిళలు తమకు ప్రభుత్వం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బీవీ సులోచనరాణి సూచించారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో శనివారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ దేశంలోని మహిళల సంక్షేమం కోసం పలు చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. వీటిపై అందరికీ అవగాహన లేకపోవడంతో ఎంతో మంది వివిధ రకాల హింసలకు గురవుతున్నారని తెలిపారు. హక్కులపై అవగాహన కలిగి ఉంటే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అన్నారు. మహిళా హక్కులపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపల్ గాయత్రి, న్యాయవాది ఎస్కే మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో డీఎఫ్ఓ పర్యటన



పక్షుల కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ హారిక

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్ఓ హారిక సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సందర్శకులకు ఏర్పాట్లుపై స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక కేంద్రంలో విడిది చేసేందుకు విదేశీ వలస విహంగాలు రాలేదని డీఎఫ్ఓ తెలియజేశారు. ఆమె వెంట స్థానిక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సౌజన్య, పులికాట్ రేంజర్ నరసింహారావు, ఎఫ్ఎస్ఓ బాలయ్య, సిబ్బంది ఉన్నారు.